నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 19 మే 2024 | NIZAMABAD



క్యాసంపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు



### ఇరవై రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నం.

ఇరవై రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నం. ఇప్పటివరకు కొనుగోలు చేస్తామని ఎవరూ రాలేదు. తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోతున్నది. ఏం చేయాలో తోచడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం తూకం జరిగేలా చూడాలి.

–రాజిరెడ్డి, రైతు, క్యాసంపల్లి

# అన్నదాత అరిగోస

## కొనుగోళ్లపై నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం







కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో వడ్లకు వచ్చిన మొలకలు



### వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి..

భూమిని కౌలుకు తీసుకొని పంట పండించి ఇక్కడికి తెచ్చిన. మొన్న కురిసిన గాలి వానకు ధాన్యం పూర్తిగా తడిసి మొలకలు కూడా వస్తున్నాయి. సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో మేము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి, రైతులకు న్యాయం చేయాలి.

–అనసూయ , క్యాసంపల్లి, రైతు

- 20 రోజులుగా కేంద్రాల్లోనే వడ్ల సంచులు
- వెంటాడుతున్న అకాల వర్షాలు
- తడుస్తున్న ధాన్యం కుప్పలు..రెండురోజులుగా మొలకలు
- పట్టించుకోని నిర్వాహకులు..ఆందోళనలో కర్షకులు

కామారెడ్డి రూరల్, మే 18: అన్నదాత ఆగమవుతున్నడు. ధాన్యం కొనుగోళ్ల వేళ ఆదుకునే దిక్కులేక తల్లడిల్లిపోతున్నాడు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించినా సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లపై సమాధానం ఇచ్చే వారులేకపోగా.. మరికొన్నిచోట్ల రైతుల ఇబ్బందులను పట్టించుకునే వారు కరువయ్యారు. ఒకవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలకు కావలి ఉన్న రైతులను.. మరోవైపు అకాలవర్షం ఆగమాగం చేస్తోంది. సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో అకాల వర్షాలకు కండ్ల ముందే ధాన్యం తడిసిపోవడం అన్నదాతను మరింత కష్టాల్లోకి నెడుతున్నది. కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రైతులు 20 రోజులుగా ధాన్యం కుప్పలకు కాపలా కాస్తున్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకురాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇరవై రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంతో కురుస్తున్న అకాల వర్షాలకు వాటికి మొలకలు వస్తున్నాయి.

### ఆందోళన బాట

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం నెలకొనడంతో అకాల వర్షాలకు వడ్ల బస్తాలు తడిసి ముద్దవుతుండడంతో అన్నదాత ఆందోళనబాట పట్టాడు. ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### ఎదురుచూపులే మిగిలాయి..



అనుకున్న సమయానికి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు వస్తలేరు. దీంతో మా కుటుంబ సభ్యులందరం ఇక్కడికి వచ్చి కాపలా ఉంటున్నం. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా నానా తంటాలు పడాల్సి వస్తోంది. కొనుగోళ్లు ఎప్పుడు చేస్తారో అని ఎదురుచూపులే మిగిలాయి.

-సంగి రాజు, రైతు, క్యాసంపల్లి

# కాంగ్రెస్‌కు షాక్..

- ఎల్లారెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ కుడుముల సత్యంపై నెగ్గిన అవిశ్వాసం
- 12 మంది కౌన్సిలర్లలో 11మంది అవిశ్వాసం వైపే
- ఫలితం ప్రకటించని అధికారులు

**ప్రతిపక్ష పార్టీలకు** చెందిన ప్రజాప్రతినిధులను తమ పార్టీలోకి చేర్చుకొని అధికారం దక్కించుకోవాలనుకున్న కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలనుకున్న హస్తం నేతలకు ఊహించని పరిణామం ఎదురైంది. మున్సిపల్ చైర్మన్‌నే తమ పార్టీలో చేర్చుకోవడంతో ఇతరులను కూడా తమ పార్టీలో చేర్చుకొని సునాయాసంగా మున్సిపాలిటీపై తమ జెండా ఎగురవేయొచ్చని అనుకున్న వారి ప్రయత్నాలపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు నీళ్లు చల్లారు. ఏకంగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల మద్దతును కూడగట్టిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు.. అవిశ్వాసం నెగ్గి కాంగ్రెస్ పెద్దల ఆలోచనలకు చెక్‌పెట్టారు.

– ఎల్లారెడ్డి, మే 18



అవిశ్వాస సమావేశానికి హాజరైన పదకొండు మంది కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం శనివారం నెగ్గింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన కుడుముల సత్యం పదవి కోల్పోవడం ఆయనకు, ఆయన మద్దతుదారులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. మున్సిపాలిటీలో 12మంది కౌన్సిలర్లుండగా 11 మంది కౌన్సిలర్లు సత్యంపై అవిశ్వాసం కోరుతూ గత నెల 24న కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 18న అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పూర్తికాగానే 11 మంది కౌన్సిలర్లతోపాటు వారి కుటుంబసభ్యులు విహారయాత్రకు వెళ్లారు. అవిశ్వాస సమావేశానికి సమయం దగ్గర పడుతున్న తరుణంలో చైర్మన్ కుడుముల సత్యంకు కనీసం ఒక్క కౌన్సిలర్ కూడా అందుబాటులో లేరు. దీంతో సమావేశాన్ని వాయిదా వేయించేందుకు న్యాయస్థానం మెట్లు ఎక్కారు. అక్కడ సైతం ఆయనకు చుక్కెదురైంది. నాలుగైదు రోజులపాటు దేశంలోని పలు ప్రాంతాల్లో విహరించిన కౌన్సిలర్ల కుటుంబాలు శనివారం ఉదయం పది గంటలకు సమావేశ ప్రాంగణమైన ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి చేరుకున్నారు. సమావేశాన్ని ప్రారంభించిన ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ మొదట కౌన్సిలర్ల సంతకాలు సేకరించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నామని, అవిశ్వాసానికి మద్దతు పలికేవారు చేతులు ఎత్తాలని పేర్కొనడంతో సమావేశానికి హాజరైన 11 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో ఆర్డీవో ప్రభాకర్ చేతులు ఎత్తిన వారి సంఖ్యను లెక్కించి సమావేశం పూర్తయ్యిందని, సమావేశానికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొని కౌన్సిలర్లను బయటికి పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 14 తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని కౌన్సిలర్లతో పేర్కొన్నారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఊహించని పరిణామం...

అధికార కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలిటీ చైర్మన్ కుడుముల సత్యంపై అవిశ్వాసం నెగ్గడం ఊహించని పరిణామమని స్థానికులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న చైర్మన్‌ను పదవి నుంచి దించడంతో ప్రతిపక్షంలోని బీఆర్‌ఎస్‌కు ఇక్కడ పట్టు ఉన్నట్లేనని అభిప్రాయపడుతున్నారు. మొదట మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు చెందిన వారు కావడంతో ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగిరింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చైర్మన్ సత్యం ఆ పార్టీలో చేరగా.. అతనికి ఏ ఒక్కరూ మద్దతు పలుకలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు సైతం అవిశ్వాసానికే మద్దతు పలుకడం గమనార్హం. చైర్మన్ పదవిపై అవిశ్వాసమని తెలిసినా సొంత పార్టీ కౌన్సిలర్లను కాపాడుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ విఫలమైనట్లు ఆ పార్టీకి చెందినవారే గుసగుసలాడుతున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ శ్రీకాంత్

### అవిశ్వాసంలో విజయం సాధించాం..

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యంపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానానికి 11 మంది కౌన్సిలర్ల మద్దతు లభించిందని, తాము విజయం సాధించామని కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ అన్నారు. సమావేశం అనంతరం ఆయన మున్సిపాలిటీ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా తాము ఏకంగా ఉన్నామని, శనివారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా 11మంది కౌన్సిలర్లు మద్దతుగా నిలిచామన్నారు. ఇది అందరి విజయమని ఆయన పేర్కొన్నారు.

## ‘టెట్’ కేంద్రాల వద్ద 144 సెక్షన్

- పది రోజులపాటు అమలు
- సీపీ కల్మేశ్వర్ సింగెనవార్

వినాయక్‌నగర్, మే 18: ఈ నెల 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్న టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ పరీక్షలు పదిరోజుల పాటు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో ఉన్న నాలెడ్జ్‌పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్‌తోపాటు ఆర్మూర్ పరిధిలోని ఎన్‌హెచ్–16 చేపూర్ వద్ద ఉన్న క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్నాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ రెండు కేంద్రాలకు వందమీటర్ల దూరంలో పదిరోజులపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు చుట్టు పక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లు, బుక్ స్టాల్స్ సైతం బంద్ పాటించాలని ఆదేశించారు.

## గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### వీసీలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

కామారెడ్డి/ కంఠేశ్వర్,మే 18: జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. టీఎస్‌పీఎస్సీ కమిషన్ సభ్యులతో కలిసి శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సజావుగా నిర్వహించాలని తెలిపారు. గత రెండుసార్లు పొరపాట్లు జరిగాయని, అవి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, అభ్యర్థులు రెండు గంటల ముందుగా వచ్చేలా చూసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 10గంటల తర్వాత కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 4,792 మంది అభ్యర్థుల కోసం 12 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని తెలిపారు. బయోమెట్రిక్ యంత్రాలు ఒకరోజు ముందు జిల్లాకు వస్తే పరిశీలించి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వీసీలో నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగెనవార్, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి






వీసీలో పాల్గొన్న కామారెడ్డి, నిజామాబాద్ కలెక్టర్లు జితేశ్ వీ పాటిల్, రాజీవ్‌గాంధీ హన్మంతు

